క్లుప్తంగా

రేపు గురుపౌర్ణమి వేడుకలు

కోవెలకుంట్ల: గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం కోవెలకుంట్ల శివారులోని సాయిబాబా ఆలయంలో గణపతి, దత్త, రుద్ర హోమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సతీష్‌శర్మ తెలిపారు. అలాగే భీమునిపాడు గ్రామంలోని పద్మనాభస్వామి ఆశ్రమంలో స్వామివారికి అభిషేకం, పల్లకీసేవ, హోమం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, తదితర పూజా కార్యక్రమాలు జరగనున్నాయి. జోళదరాశి, రేవనూరు, లింగాల, బిజనవేముల, కలుగొట్ల, వెలగటూరు, గుళ్లదూర్తి, తదితర గ్రామాల్లో వెలసిన ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అసాంఘిక కార్యక్రమాలతో జీవితాలు నాశనం


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ గంటా సుబ్బారావు

బనగానపల్లె రూరల్: గొడవలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని బనగానపల్లె సీఐ గంటాసుబ్బారావు అన్నారు. శుక్రవారం స్థానిక సీఐ కార్యాలయంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాలకు పాల్పడితే దాని ప్రభావం పిల్లలు, కుటుంబంపై పడుతుందన్నారు. క్రమశిక్షణ, సత్ప్రవర్తనతో ఉండాలని సూచించారు. ప్రతి కదలికలపై పోలీసులు నిఘా ఉంటుందని హెచ్చరించారు. నేరాలకు దూరంగా ఉంటూ కుటుంబంతో హాయిగా జీవించాలని హితవుపలికారు.

సమాజంలో వైద్యుల సేవలు వెలకట్టలేనివి


వైద్యులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: రోగుల ప్రాణాలను నిలిపే వైద్యుల సేవలు వెలకట్టలేనివని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీ వైద్యులు సాగరిక, స్వప్న ప్రియ, వెంకటేష్, చరన్ రాజు, దంత వైద్యుడు వెంకటేశ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్యుడు భగవంతుడితో సమానమన్నారు. ఎల్లప్పుడూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు గుండా గోపాలు, విజయనాగరాజు, సత్తార్, రాధా స్వరూప్, మాణిక్యం, వీర భద్రా రెడ్డి, రామూర్తి పాల్గొన్నారు.

వర్షానికి కూలిన మట్టిమిద్దె


కూలిన ఇంటి వద్ద బాధితురాలు

ప్యాపిలి: మండల పరిధిలోని కొమ్మేమర్రి గ్రామంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి దూదేకుల హుసేన్‌బీకి చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. అయితే ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మట్టి మిద్దె కూలిపోవడంతో ఇంట్లో ఉన్న వస్తువులు ధ్వంసమయ్యాయి. ధాన్యం, దుస్తులు తదితర వస్తువులు వర్షానికి తడిచిపోవడంతో సుమారు రూ. 5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు వాపోయింది. ప్రభుత్వం తనకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరింది.

సీజ్ చేసిన వాహనాలకు నిప్పు


కాలిపోయిన ద్విచక్రవాహనాలు

బనగానపల్లె రూరల్: వివిధ కేసుల్లో సీజ్ చేసి బనగానపల్లె సబ్ ట్రెజరీ కార్యాలయం వద్ద ఉంచిన వాహనాలకు గుర్తు తెలియని దుండగులు శుక్రవారం ఉదయం నిప్పంటించారు. సమాచారం అందుకున్న బనగానపల్లె అగ్నిమాపక శాఖ అధికారి నరసింహా తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కార్యాలయం వెనుక వైపు ఉంచిన వాహనాల వద్ద చెత్త చెదారం ఎక్కువగా ఉండడంతో ఆకతాయిలు నిప్పు పెట్టి ఉంటారని అనుమానిస్తున్నారు. నిత్యం పోలీసు బందోబస్తు ఉండే సబ్ ట్రెజరీ కార్యాలయం వద్ద ఇలాంటి సంఘటన జరగడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బేతంచెర్ల: మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీ మధుసూదన్ రెడ్డి, రూరల్, టౌన్ ఏఈలు శ్రీనివాసులు, మహబూబ్ వలి తెలిపారు. సిమెంట్ నగర్ గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బేతంచెర్ల పట్టణంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

భారీ వర్షం.. పొలాలు జలమయం


బనగానపల్లె: పొలాల్లో నిలిచిన వర్షపు నీరు


కోవెలకుంట్ల: మినుము పంటకు ఊరటనిచ్చిన వర్షం

- బనగానపల్లె, డోన్‌లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం
- సాగులో ఉన్న పంటలకు ఊపిరి
- వరి, ఇతర పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులు


కోవెలకుంట్ల: జలమయమైన ప్రధాన వీధి


బేతంచెర్లలో కురుస్తున్న వర్షం

బనగానపల్లె: నియాజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షపాతం నమోదైంది. పొలాలు జలమయమయ్యాయి. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం బనగానపల్లె నియోజకవర్గంలో 4 వేల హెక్టార్లలో మొక్కజొన్న, 12 ఎకరాల్లో పత్తి, 2,200 ఎకరాల్లో కంది, 300 హెక్టార్లలో కొర్ర, ఆముదం వేరుశనగ పంటలను రైతులు సాగు చేశారు. కొద్ది రోజులుగా సరైన వర్షాలు లేక వాడిపోయిన పంటలకు వర్షం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలువురు రైతులు వరి, మిరప సాగుకు సిద్ధమవుతున్నారు. మరిన్ని పంటలను సాగు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

మోస్తరు వర్షం

కొలిమిగుండ్ల: ఉపరితల ఆవర్తన ద్రోణి కారణంగా శుక్రవారం మండల వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నాయి. రెండు రోజుల నుంచి తేలికపాటి నుంచి మోస్తరు వర్షానికే పరిమితమైంది. ఖరీఫ్‌లో పంటలు సాగు చేసేందుకు రైతులు పొలాలను దుక్కులు దున్నుకుని సిద్ధంగా ఉన్నారు. కొంత మంది రైతులు ఇప్పటికే మినుము, కంది తదితర పంటలను సాగు చేయడంతో అరకొరగా కురుస్తున్న వర్షాలు కొంత వరకు ఊరటనిస్తున్నాయి. నెలన్నరగా మండలంలో భారీ వర్షం కురవకపోవడంతో చెరువులు వెలవెలబోతున్నాయి.

రైతుల్లో ఆనందం

బేతంచెర్ల: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. జూన్‌లో సమృద్ధిగా వర్షాలు కురవడంతో రైతులు కంది, కొర్ర, మొక్కజొన్న, మినుము, ఆముదం పంటలు సాగు చేశారు. కొద్ది రోజులుగా వర్షాలు లేక ఆందోళనలో ఉన్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

ఖరీఫ్ రైతులకు ఊరట

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం అవుకు మండలంలో 36.6 మి.మీ, కోవెలకుంట్ల మండలంలో 22 మి.మీ, కొలిమిగుండ్ల మండలంలో 15.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయధికారులు పేర్కొన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ రైతులు ఊరట చెందుతున్నారు. సీజన్‌లో సాగు చేసిన పత్తి, మినుము, కంది, పెసర, ఆముదం, మొక్కజొన్న, తదితర పంటలకు వర్షం ఊపిరి పోయడంతోపాటు సాగు చేయాల్సిన పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: క్షణికావేశంతో నేరాలకు పాల్పడి జైలు జీవితం గడుపుతున్న వారు సత్ప్రవర్తనతో మెలగాలని మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. స్థానిక సబ్ జైలును శుక్రవారం తనిఖీ చేశారు. సబ్ జైలు పరిసరాలు, భోజన వసతులను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేరాలకు పాల్పడడం వల్ల కుటుంబాలకు దూరంగా జైలు జీవితం గడపాల్సి ఉంటుందన్నారు. తప్పు తెలుసుకుని మారితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. న్యాయవాదిని నియమించుకోవడానికి ఆర్థిక స్తోమత లేని వారికి ప్రభుత్వం తరుపున ఉచిత న్యాయసేవలు అందిస్తామని తెలిపారు. జైలు సూపరింటెండెంట్ రఘునాథరెడ్డి ఉన్నారు.

గురుపౌర్ణమి వేడుకలు వాయిదా

అవుకు: మండల కేంద్రం అవుకులో ఈ నెల 21వ తేదీ జరగాల్సిన గురుపౌర్ణమి వేడుకలు వాయిదా వేసినట్లు షిరిడీ సాయి సేవా సమితి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. భారీ వర్ష సూచన కారణంగా వేడుకలను డిసెంబర్‌లో వచ్చే దత్త సప్తమి రోజున నిర్వహిస్తామని పేర్కొంది. సాయిబాబా భక్తులందరూ సహకరించాలని కోరింది.

లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు

బేతంచెర్ల: ప్రభుత్వ సహకారంతో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తామని ఎంపీడీఓ రవి ప్రసాద్, డోన్ హౌసింగ్ డీఈ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ శేషన్న, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్‌తో సమావేశం నిర్వహించారు. ఇళ్ల లబ్ధిదారులకు దశలవారీగా బిల్లులు మంజూరు చేస్తామని తెలిపారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. అలాగే ఉపాధి కూలీలకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్స్‌ను ఆదేశించారు.

వ్యక్తిగత శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి చెన్నకేశవులు

డోన్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని చిన్నమల్కాపురం వైద్యాధికారి చెన్నకేశవులు అన్నారు. శుక్రవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని తెలిపారు. అనంతరం పాఠశాల వంట గదిని పరిశీలించి ఆహారం కలుషితం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిర్వాహకులకు సూచనలు చేశారు. వైద్యాధికారులు ప్రభాకర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన

అవుకు: విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ మల్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం అవుకు మండల పరిధిలోని కొండమనాయునిపల్లె పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పిల్లలకు వడ్డించే భోజనాన్ని నాణ్యమైన ఆహార పదార్థాలతో చేయాలని వంట నిర్వాహకులకు సూచించారు. అలాగే వడ్డించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల ప్రాంగణాన్ని, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆదేశించారు. అనంతరం పిల్లలతో కలిసి భోజనం చేశారు.

పెట్టుబడి సాయం అందించాలి

బనగానపల్లె: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం బనగానపల్లె సచివాలయం-3లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శివకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ నాయకులు సుబ్బయ్య, మనోహర్, గోపాల్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి

బేతంచెర్ల: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ పోరాటాలు చేస్తుందని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎర్రి స్వామి అన్నారు. శుక్రవారం బేతంచెర్లలో ఏబీవీపీ నంద్యాల జిల్లా కన్వీనర్ రవిశేఖర్ ఆధ్వర్యంలో నగర కమిటీని ప్రకటించారు. ఏబీవీపీ నగర కార్యదర్శిగా దత్తాత్రేయ, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాసులు, శివను ప్రకటించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ విద్యార్థుల్లో దేశ భక్తి నింపుతూ సమాజ హితం కోసం పనిచేస్తుందని తెలిపారు.

పీహెచ్‌సీ, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


జలదుర్గం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న నోడల్ అధికారి

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్రీయ బాల స్వాస్త్య కార్యక్రమం నోడల్ ఆఫీసర్ కాంతారావు నాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. మందులు, రికార్డులను పరిశీలించారు. జలదుర్గం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై ఆరా తీశారు. అనంతరం చంద్రపల్లి, కొమ్మేమర్రి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రం, విలేజ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మాతా, శిశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లు, పీహెచ్‌సీ సిబ్బంది విధుల్లో అలసత్వం వహించొద్దని సూచించారు. జలదుర్గం వైద్యాధికారిణి నుస్రత్ ఉ జొహరా ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వడ్డించాలని మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు అన్నారు. శుక్రవారం బనగానపల్లె పట్టణం రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌ను ఎంఈఓలు స్వరూప, శ్రీనివాసులుతో కలిసి తనిఖీ చేశారు. పాఠశాలలోని మొత్తం విద్యార్థుల సంఖ్య, భోజన పథకంలో మెనూ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. భోజన నిర్వాహకులు వ్యక్తిగత శుభ్రతతో పాటు వంట గది, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. భోజనానికి తాజా కూరగాయలను వినియోగించాలన్నారు. అనంతరం పక్కనే ఉన్న బాలికల వసతి గృహాన్ని సందర్శించి సమస్యలపై హాస్టల్ సిబ్బందితో మాట్లాడారు.

పండ్ల తోటల పెంపకంతో మంచి లాభాలు


మాట్లాడుతున్న డోన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ ఏపీడీ బాలాజీ నాయక్

బనగానపల్లె రూరల్: పండ్ల తోటల పెంపకంతో మంచి లాభాలు వస్తాయని, జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్లతోటల సాగుకు కల్పిస్తున్న రాయితీలపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని డోన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ ఏపీడీ బాలాజీనాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక పాదుపు భవనంలో ఉపాధి పనులపై సమీక్షించారు. ఈయన మాట్లాడుతూ.. బనగానపల్లె మండలంలో 400 ఎకరాల్లో పంటల తోటల పెంపకం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటికే 186 మంది రైతులను గుర్తించామని, వారితో పండ్ల తోటల సాగు చేసేలా టీఏ, ఎఫ్ఏలు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధి పనులపై చర్చించారు. ఏపీఓ హరికృష్ణ, ఈసీ హరికిశోర్, టీఏలు ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

పాండే సేవలు చిరస్మరణీయం


మంగళ్ పాండే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈఓ-2

డోన్ టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు మంగళ్ పాండే సేవలు చిరస్మరణీయమని మండల విద్యాధికారి-2 రామనర్సప్ప అన్నారు. మంగళ్‌పాండే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కొత్తపేట జెడ్పీ హైస్కూల్‌లో సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ, సమగ్ర వినియోగదారుల రక్షణ సంఘం అధ్యక్షుడు ఏఈ నాగరాజుతో కలిసి పాండే చిత్ర పటానికి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో పాండే పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. వాతావరణ కాలుష్యం, మొక్కల ఆవశ్యకత, ఆరోగ్య పరిరక్షణ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యంశెట్టి, శ్రీనివాసులు, లోక్‌నాథ్ రెడ్డి, లక్ష్మీదేవి, రాఘవేంద్రమ్మ, సీఆర్పీ రజనీకాంత్ పాల్గొన్నారు.

పశు వ్యాధులపై అవగాహన అవసరం


రైతులకు మందులు అందజేస్తున్న ఏడీ డాక్టర్ మోహన్ రావు

సంజామల: పశు వ్యాధులపై పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మోహన్ రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గిద్దలూరు గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఏడీ మోహన్ రావు మాట్లడుతూ.. పాడి రైతులు పశువులకు వచ్చే వ్యాధులను గుర్తించి సరైన సమయంలో చికిత్స చేయించాలని సూచించారు. గ్రామంలో గర్భకోశ వ్యాధి కలిగిన 30 పశువులకు ఉచితంగా చికిత్స అందించామన్నారు. అనంతరం కాల్షియమ్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యులు రఘుబాల క్రిష్ణ, రమేష్‌బాబు, పద్మావతి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాకాలం.. జాగ్రత్తలు అవసరం

- విద్యుత్ ప్రమాదాలతో జాగ్రత్త
- విద్యుత్‌శాఖ అధికారులు

కొలిమిగుండ్ల: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని.. ప్రజలు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ ఏఈ ప్రసన్న వెంకటేష్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు ఇళ్ల వద్ద విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, హోల్డర్లు ఇతర పరికరాలు నాణ్యమైనవి ఉపయోగించాలని సూచించారు. ఇళ్ల వద్ద ప్రతి ఒక్కరూ ఎర్త్ పైపు ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ ప్రమాదాలను అరికట్టవచ్చన్నారు. వర్షం కురిసే సమయంలో విద్యుత్ స్తంభాలు, స్టేవైర్లు ముట్టుకోవద్దని సూచించారు. ఇళ్లు, ఇతర నిర్మాణాలు జరిగే సమయంలో విద్యుత్ లైన్లు, స్తంభాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తడి చేతులు, కాళ్లతో స్విచ్ఛ్‌లు వేయరాదన్నారు. పొలాలు, తోటల వద్ద విద్యుత్ తీగలు తెగి పడి ఉంటే వెంటనే విద్యుత్ శాఖ సిబ్బంది, 1912కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

జాగ్రత్తలు పాటించాలి

బేతంచెర్ల: వర్షా కాలంలో విద్యుత్ ప్రమాదాల బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఇంట్లో అతుకుల విద్యుత్ తీగలు ఉంటే వాటిని ఎలక్ట్రీషియన్‌తో మార్చుకోవాలని సూచించారు. రహదారి వెంట ఉన్న విద్యుత్ స్తంభాలు, సపోర్టు వైర్లను ఎట్టి పరిస్థితుల్లో తాకవద్దన్నారు. బట్టలు ఆరేసుకునే వైర్లకు విద్యుత్ తీగలు తగలకుండా చూసుకోవాలని తెలిపారు. వర్షం పడుతున్న సమయంలో వ్యవసాయ మోటార్లను ఆన్ చేయవద్దని.. పశువులను విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచాలని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు మార్చడం, మరమ్మతులు చేయడం వద్దని సూచించారు.

వర్షంలో విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దు

డోన్ టౌన్: వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలు, వైర్లను ముట్టుకోకూడదని ఏఈ నాగేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. తడి చేతులు, తడి వస్తువులతో స్విచ్‌లు వేయరాదని సూచించారు. తోటలు, పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడితే వెంటనే ఏఈకి లేదా 1912కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

బాలికల చదువు.. ఇంటికి వెలుగు

- ఆర్డీఓ మహేశ్వరరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేశ్వరరెడ్డి

డోన్: బాలికల చదువు ఇంటికి వెలుగు అని, విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీఓ) మహేశ్వరరెడ్డి, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ షంషాద్‌బేగం అన్నారు. పట్టణంలోని డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి నగర్, జంగాలకాలనీలో శుక్రవారం బాల్య వివాహాలు, నివారణ చర్యలు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బేటీ బచావో.. బేటి పడావో కార్యక్రమం ఫలితంగా చాలా మంది తల్లిదండ్రులు ఆడబిడ్డలను ఉన్నత చదువులు చదివించాలని భావిస్తున్నారని తెలిపారు. చదువుకు దూరం చేసి పెళ్లిళ్లు చేస్తే వారికి అన్నివిధాలా అన్యాయం చేసిన వారమవుతామన్నారు. వారి శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు భవిష్యత్తులో జరిగే దుష్ప్రలితాలకు తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. 18 ఏళ్లు నిండే వరకు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయరాదని డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్, ఏఎస్ఐ శ్రీనివాసులు, మహిళా న్యాయవాది మీనిగ కుమారి సూచించారు. ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా పెంచాలని, తేడా చూపిస్తే వారి జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. బాలికలను ప్రోత్సహిస్తే బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో గీతావాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పరమేశ్వరి, శోభ, పద్మ, తిప్పమ్మ, రాధ, దేవకృప, ఈశ్వరమ్మ, సుగుణమ్మ, శకుంతల, అంగన్‌వాడీ వర్కర్లు సులోచన, మంజుల, సుభద్ర, బుడగ జంగాల పిల్లల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెట్టుబడి సహాయం అందించాలని నిరసన

డోన్ టౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ.20 వేలును వెంటనే అందజేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం మండల నాయకుడు మధుసూదన్, సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కోయిలకొండ నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉడుములపాడు గ్రామ సచివాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల దాటినా ఇంత వరకు ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందజేయలేదని విమర్శించారు. కేవలం శ్వేత పత్రాల పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు. కేరళ తరహాలో రైతు విమోచన చట్టం తీసుకొచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. సీఐటీయూ నాయకులు చిన్న రహిమాన్, అశోక్, పద్మనాభయ్య, శంకర్, కృష్ణమూర్తి, పెద్దన్న, నాగేంద్ర, విజయుడు పాల్గొన్నారు.

బార్ కౌన్సిల్ నిర్ణయంపై నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

డోన్/డోన్ టౌన్: న్యాయవాదులు సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ మంజూరు కోసం బార్ కౌన్సిల్ రూపొందించిన నిబంధనలు సరికాదని.. నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని డోన్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్ అన్నారు. స్థానిక కోర్టు భవనం ఎదుట శుక్రవారం న్యాయవాదులతో కలిసి నిరసన తెలిపారు. న్యాయవాదుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా బార్ కౌన్సిల్ వ్యవహరిస్తోందన్నారు. రెన్యూవల్ ఫీజు రూ.200 నుంచి రూ. 500లకు పెంచడం, ప్రాక్టీస్ ధ్రువీకరణకు ఐదు వకల్తాలు ఉండాలనడం, పదో తరగతి నుంచి న్యాయశాస్త్రం వరకు స్టడీ సర్టిఫికెట్లు జత చేయాలనడం అన్యాయమన్నారు. 35 ఏళ్లు నిండిన ప్రతి న్యాయవాదికి వెల్ఫేర్ ఫండ్ పొందే అవకాశం కల్పించాలని కోరారు. బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు బద్దల వెంకటేష్, కార్యదర్శి కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

కనులపండువగా తిరుచ్చి ఉత్సవం


ఆలయ మాడవీధుల్లో విహరిస్తున్న మద్దిలేటి నరసింహస్వామి

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామివారికి తిరుచ్చి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, వేదపండితులు ఉదయం నరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై స్వామివారిని కొలువుదీర్చారు. మంగళ వాయిద్యాలు, గోవింద నామస్మరణల నడుమ స్వామివారిని ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. కార్యక్రమంలో అర్చకులు మనోహర్, నరసింహ, చిన్న మద్దిలేటిస్వామి, రాఘవయ్య, సాగర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జియారత్ వేడుకలు


దస్తగిరి స్వామికి ఫతేహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో దస్తగిరిస్వామి, మౌలాలిస్వామి జియారత్ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభయ్యాయి. మధ్యాహ్నం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కందూరు నిర్వహించారు. జార్తలను పురస్కరించుకుని గ్రామంలో వెలసిన పీర్లచావిళ్లను విద్యుత్‌దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివార్లకు భక్తులు దట్టీలు, వెండిగొడుగులు, పూల దండలను ఊరేగింపుగా తీసుకొచ్చి పీర్ల దేవుళ్లకు అలంకరించారు. భక్తులు సాయంత్రం నుంచి రాత్రి వరకు చావిళ్లను చేరుకుని స్వామివార్లకు ప్రత్యేక ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జియారత్ వేడుకలకు జిల్లా నుంచే కాకుండా వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, అనంతపురం, తాడిపత్రి, హైదరాబాద్, తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో గుళ్లదూర్తి జనసంద్రమైంది. శనివారం సాయంత్రంతో జియారత్ వేడుకలు ముగియనున్నాయి. కోవెలకుంట్ల సీఐ జయచంద్ర, ఎస్ఐలు వరప్రసాద్, రాజ్‌కుమార్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

